

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది మంది తరలివచ్చి కొనేరుల్లో పుణ్యస్నానాలు చేసి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు.



వ్యర్థం..కళాత్మక ఖండం

రీసైక్లింగ్ ఆర్ట్స్‌లో ఓ యువకుడు రాణిస్తున్నాడు. నిరుపయోగ వస్తువులను కళాత్మక ఖండాలుగా తీర్చిదిద్ది అబ్బురపరుస్తున్నాడు. ప్రోత్సాహం అందిస్తే మరింత రాణిస్తానని చెబుతున్నాడు. 8లో▸

న్యూస్‌రీల్

యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త

- కలెక్టర్ రంజిత్‌బాషా



వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): తెలుగు సమాజాన్ని చైతన్య పరచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని కలెక్టర్ డాక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. ఆయన రాసిన పద్యాలు సన్మార్గంలో ఎలా నడవాలో తెలియజేస్తాయని, ఆయన గొప్పతనాన్ని ఎంత పొగిడినా తక్కువేనన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో యోగి వేమన జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యోగి వేమన ప్రజాకవి అని, పామరులు, పండితులను అలరించిన ఆయన కవిత్వం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమవ్వడం ఆయన విధానమన్నారు. సమాజంలో ఉన్న దురాచారాలపై ఆనాడే తన పద్యాలతో ధైర్యంగా ఎదురించారని, ఆయన చేసిన రచనలు మానవత్వంతో కూడుకున్నవన్నారు. తెలుగు భాషను ప్రపంచానికి చాటిన గొప్ప కవి, పండితుడు వేమన అని, ఆయన స్ఫూర్తిని నేటి తరాలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఇన్‌చార్జి సీపీఓ భారతి, సెట్కూరు ఇన్‌చార్జ్ సీఈఓ దీప్తి పాల్గొన్నారు.

కర్నూలులో 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు (టౌన్): రన్ ఫర్ హెల్త్ నేషన్ అనే నినాదంతో కర్నూలులోని జిల్లా పరిషత్తు గాంధీ విగ్రహం వద్ద 2కె రన్‌ను ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు ప్రారంభించారు. జిల్లా పరిషత్తు నుంచి కొండారెడ్డి బురుజు వరకు రన్ కొనసాగింది. కార్యక్రమంలో సంకల్ప కమిటీ ప్రతినిధులు మహవీర్ చిరంజీవి, నిఖిల్, సునీత, సోనీ, వీణ రాకేష్, భువన, క్రీడా సంఘాల ప్రతినిధులు, బెటాలియన్ పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీబీ డ్యామ్‌లో తగ్గుతున్న నీటిమట్టం



హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం వేగంగా పడిపోతుంది. ఈ నెల 5వ తేదీ నుంచి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. 11,686 క్యూసెక్కులు కాల్వలకు (ఔట్‌ఫ్లో) వదులుతున్నారు. ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులుగా నమోదు కావడం, సాగు, తాగుకు డిమాండ్ పెరగడంతో రోజుకు ఒక టీఎంసీ మేర నీరు ఖాళీ అవుతోంది. 15 రోజుల వ్యవధిలో 13 టీఎంసీలు కాల్వలకు విడుదల చేశారు. తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యం 1,633 అడుగులతో 105.788 టీఎంసీలుండగా ఆదివారం 1,621 అడుగులతో 64 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎల్లెల్సీకి మార్చి నెలాఖరు వరకు నీటి విడుదల చేసేందుకు టీబీ బోర్డు అధికారులు ఇటీవలే జరిగిన ఇరు రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారుల సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఎల్లెల్సీ ఆంధ్ర పరిధి కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 555 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

భూములు నవ్వుతున్నాయి.. రాళ్లు వెక్కిరిస్తున్నాయి!

- నేటి నుంచి భూముల రీసర్వే
- జగనన్న బాటలోనే కూటమి ప్రభుత్వం
- నాడు రాద్ధాంతం చేసి నేడు రీ సర్వేకు సిద్ధం
- గతంలో ఎక్కడ నిలిచిందో అక్కడి నుంచి మొదలు
- జిల్లాలో 25 గ్రామాల్లో నిర్వహణ

'భూములు లాగేసుకుంటారు.. వారసత్వంగా వచ్చిన భూములకు రీ సర్వే అవసరమా.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంతా మోసం'.. అంటూ ఎన్నికల ముందు విషం చిమ్మిన కూటమి నేతలు ఇప్పుడు అదే రీసర్వేకు రైట్ చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన పాలకులు నేడు తిరిగి జగనన్న బాటలోనే అడుగులు వేస్తున్నారు. ఊసరవెల్లి సిగ్గుపడేలా ఉన్న కూటమి నాయకుల తీరును చూసి నాడు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకం కింద సర్వే చేసిన భూములు నవ్వుతుండగా.. పాతిన రాళ్లు వెక్కిరిస్తున్నాయి. రాజకీయ లబ్ధి కోసం నాడు రీ సర్వేపై అంత దిగజారి దుష్ప్రచారం చేయాలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కర్నూలు(సెంట్రల్): తాము అధికారంలోకి వస్తే భూముల రీసర్వే చేయబోమని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. వారిచ్చిన మాటపైనే వారికి నమ్మకం లేదో ఏమో.. భూ సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన రీసర్వేను కొనసాగించాలని నిర్ణయించారు. భూ సమస్యలకు అంతకంటే పరిష్కారం చూపేమార్గం లేదని వారు గ్రహించి ఉంటారనే అందరిలో ఇదే చర్చ కొనసాగుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ జగనన్న భూ హక్కు భూరక్ష పథకం పేరుమార్చి ఏపీ రీసర్వే ప్రాజెక్టు పేరుతో మళ్లీ ఈనెల 20వ తేదీ నుంచి రీసర్వేను ప్రారంభిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడి నుంచి అయితే రీసర్వే నిలిచిపోయిందో అక్కడి నుంచే మళ్లీ సర్వే ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2019-24 మధ్య సీఎంగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన రీసర్వే చరిత్రాత్మకం. ఈ రీసర్వేతో రైతుల సమస్యలు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు గుప్పించింది. ఏళ్లకు ఏళ్లుగా భూసమస్యల పరష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల ముందు బాధిత రైతులు బారులు తీరే వారు. వాటికి పరిష్కారం చూపడం అధికారులకు కష్టతరమైన పని. ఈక్రమంలో ఎప్పుడో నూరేళ్ల కింద బ్రిటీషు ప్రభుత్వ హయాంలో జరిగిన సర్వేను మళ్లీ సర్వే చేసి అన్నదాతలకు ఇబ్బంది లేకుండా చేయాలని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా భూముల రీసర్వేతో పాటు రికార్డుల వ్యూరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం మూడు విడతల్లో 472 గ్రామాలకుగాను 254 గ్రామాల్లో రీసర్వేను పూర్తి చేసి రెండు లక్షల మందికి పైగా రైతులకు భూ హక్కు పత్రాలు ఇచ్చింది. ఇంకా 218 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా ఎన్నికలు జరగడంతో చరిత్రాత్మక ప్రాజెక్టు నిలిచిపోయింది.



ఎన్నికల ముందు విషం చిమ్మి..

వైఎస్సార్ జగనన్న భూ హక్కు..భూరక్ష పథకంపై ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు విషం చిమ్మారు. రైతుల భూములను సర్వే చేసే హక్కు ఎవరు ఇచ్చారని ఏక వచనంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దూషించారు. అందుకు ఎల్లో మీడియా వంత పాడింది. టీడీపీ సోషల్ మీడియా లేనిపోని భయాందోళనలను ప్రజల్లో రేకెత్తించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రీసర్వేను మళ్లీ చేపట్టబోమని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అందరూ రీసర్వే జరగదని భావించారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ రీసర్వే కొనసాగించేందుకు సీఎం చంద్రబాబునాయుడు పచ్చజెండా ఊపారు. ఈ క్రమంలో ఆనాడు ఎల్లో మీడియా, సోషల్ మీడియా చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తెలిపోయింది.



కల్లూరు చెన్నమ్మ సర్కిల్ ఎన్నికల సభలో రీ సర్వే పత్రాలను దగ్ధం చేస్తున్న చంద్రబాబు (ఫైల్)

సంక్షేమ పాలన గుర్తులు చెరిపేస్తూ..

గత ప్రభుత్వ హయాంలో పాడుబడిన స్కూళ్లను నాడు-నేడు పేరుతో బాగు చేశారు. దెబ్బతిన్న రహదారులను నాడు-నేడు పేరుతో మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూశారు. ఈ ప్రభుత్వంలో మాత్రం రీసర్వే పూర్తయి భూముల సరిహద్దు రాళ్లపై ఉన్న వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు-భూ రక్ష -2020 పేరును తుడిచి నాడు-నేడు కింద చూపుతున్నారు. నాడు-నేడు అంటే గత ప్రభుత్వానికి...ఈ ప్రభుత్వానికి తేడా ఏమిటో ప్రజలే గమనించాలి. ఎరేజింగ్ మిషన్లతో జగన్ పేరును తొలగించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. కర్నూలు జిల్లాలో మొదటి విడతలో 99,454, రెండో విడతలో 39,874, మూడో విడతలో 1,22,154 మొత్తం 2,61,487 సర్వే రాళ్లను పాతారు.



నాడు.. నేడు : సర్వే రాళ్లపై అక్షరాలు తొలగించిన దృశ్యం



గోనెగండ్ల మండలం ఎర్రబాడులో సర్వే రాయిపై ఉన్న అక్షరాలను ఎరేజింగ్ మిషన్‌తో చెరిపేస్తూ..

జిల్లాలో మొత్తం రెవెన్యూ గ్రామాలు	472
వైఎస్సార్‌సీపీ పాలనలో రీ సర్వే పూర్తయిన గ్రామాలు	254
ప్రస్తుతం రీ సర్వే జరిగే గ్రామాలు	25
రీ సర్వేలో పాల్గొనే బృందాలు	101

మండలానికి ఓ పైలట్ గ్రామం ఎంపిక

నేటి నుంచి రీసర్వే తిరిగి ప్రారంభం కానున్నది. వైఎస్సార్ జగనన్న భూ హక్కు-భూరక్ష పేరును ఏపీ రీసర్వే ప్రాజెక్టు పేరుతో మార్చి రీసర్వే చేయనున్నారు. జిల్లాలో మండలానికో గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసుకొని రీసర్వే చేస్తారు. అందులో భాగంగా జిల్లాలోని 25 మండలాల్లో 25 గ్రామాలను రీసర్వే పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. ఇందుకోసం రీసర్వే డీటీలు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లకు ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చారు. అయితే రైతుల సమక్షంలోనే రీసర్వే జరగాలనే చిన్న మెలికను మాత్రం పెట్టారు. జిల్లాలో 25 గ్రామాల పరిధిలోని 37,402 మంది రైతులకు సంబంధించి 13,271 సర్వే నంబర్ల పరిధిలోని 1,22,832.44 ఎకరాల భూమిని 101 సర్వే బృందాలతో రీసర్వే చేస్తారు. కాగా బృందం సభ్యులకు అవసరమైన రోవర్లు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వాల్సి ఉంది.

జిల్లాలో రీసర్వే జరిగే గ్రామాలు

మండలం	రీసర్వే జరిగే గ్రామం
ఆదోని	పెసలబండ
గోనెగండ్ల	గోనెగొండ్ల
హొళగుంద	పెద్దహెట్ట
కోసిగి	చింతకుంట
కౌతాళం	గుడికంబాళి
మంత్రాలయం	చెట్నిహళ్లి
నందవరం	నదికైరవడి
పెద్దకడబూరు	నౌలేకల్
ఎమ్మిగనూరు	కడిమెట్ల
సీ బెళగల్	సీబెళగల్
గూడూరు	చనుగొండ్ల
కల్లూరు	పర్ల
కోడుమూరు	యర్రదొడ్డి
కర్నూలు రూరల్	ఈ.తాండ్రపాడు
ఓర్వకల్	మీదివేముల
వెల్దుర్తి	గోవర్ధనగిరి
ఆలూరు	మనెకుర్తి
ఆస్పరి	హాలిగేర
చిప్పగిరి	బంటనహాల్
హొలహర్వి	పచ్చర్లపల్లి
మద్దికెర	పెరవలి
పత్తికొండ	జూటూరు
తుగ్గలి	పగిడిరాయి
దేవనకొండ	కరివేముల
కృష్ణగిరి	ఎరుకల చెర్వు

రైతుల సమక్షంలోనే రీసర్వే..



గతంలో ఎక్కడైతే రీసర్వే నిలిచిపోయిందో మళ్లీ అక్కడి నుంచే ప్రారంభం అవుతుంది. జిల్లాలో 25 గ్రామాల్లో రీసర్వే మొదటి విడతలో జరుగుతుంది. రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చాం. డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ పనులు గతంలో మాదిరిగానే యథాతథంగా జరుగుతాయి. – మునికన్నన్, సర్వే ఏడీ

పడగొట్టారు.. వదిలేశారు

- రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల ముందు మెట్లు, గోడలు కూల్చివేత
- నెలన్నరవుతున్నా మొదలుకాని పనులు



ఇళ్ల ముందు మెట్లు తొలగించిన దృశ్యం

పాణ్యం: ఆర్అండ్‌బీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు విస్తరణ, కాల్వల నిర్మాణ పేరుతో పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో హడావుడిగా రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల ముందు మెట్లు, గోడలను కూల్చివేశారు. గత నెల 5వ తేదీన యంత్రాలతో తొలగింపు పనులు జరిగాయి. సాక్షాతు రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఈ పనులను పరిశీలించారు. మరి నేటికి నెలన్నరవుతున్నా రోడ్డు విస్తరణ జరగలేదు..కాల్వల నిర్మాణం మొదలుకాలేదు. ఇళ్ల ముందు కూల్చివేతలతో జనం మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకు కూడా తీవ్ర సమస్యగా మా రిందని వాహనదారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే జాప్యంపై ఆర్అండ్‌బీ అధికారి వెంకటేశ్వరరెడ్డి వివరణ కోరగా ఆలమూరు గ్రామం మలుపు వద్ద నుంచి ముందున్న కాల్వలో వర్షపునీటిని కలిపేందుకు రూ. 14లక్షలతో ప్రతిపాదనలు పంపామని, అయితే, ఈ పనులకు సంబంధించి ఇంకా అనుమతులు రాలేదని పేర్కొనడం గమనార్హం.

దివ్యాంగ పింఛన్లపై కుట్ర!

- దివ్యాంగులకు 23 నుంచి ఆసుపత్రుల్లో మళ్లీ వైద్య పరీక్షలు
- అర్హత ఉన్నప్పటికీ అనర్హత వేటు వేసే అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం పగ పట్టింది. రూ.6 వేల పింఛన్ పొందుతున్న దివ్యాంగులందరూ మళ్లీ అర్హత పరీక్షకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. పింఛన్‌దారులైన దివ్యాంగులకు ఈ నెల 20 నుంచి నోటీసులు ఇవ్వడం, 23 నుంచి డాక్టర్ల ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఎన్నికల సమయంలో దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచుతామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులపై అనర్హత అనే కొరడా ఝుళిపిస్తున్నారు.

ఇలా చేస్తారు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.6 వేల ప్రకారం పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులు జనవరి నెలలో 56,645 మంది ఉన్నారు. కర్నూలు జిల్లాలో పూర్తి స్థాయిలో అర్హత పరీక్షలు నిర్వహిస్తుండగా.. నంద్యాల జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ నెల 21 నుంచి 23 వరకు అంధులు, బధిరులు (చెవిటి, మూగ) వారికి మాత్రమే వైద్య పరీక్షలు చేయనున్నారు. కర్నూలు జిల్లాలో పింఛన్ పొందుతున్న దివ్యాంగులు 31,002 మంది ఉన్నారు. వీరందరూ మళ్లీ వైద్య పరీక్షలకు హాజరు కావాల్సిందే. ప్రస్తుతం పింఛన్ పొందుతున్న దివ్యాంగుల్లో 85-90 శాతం మంది టీడీపీ హయాం నుంచి ఉన్నారు. 30 వేల దివ్యాంగుల్లో 10-15 శాతం వరకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరైంది. పింఛన్ల భారాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా ప్రస్తుతం అనర్హత అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. కర్నూలు సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని ఏరియా హాస్పిటల్ తదితర ఆసుపత్రుల్లో కూడా దివ్యాంగులకు వైద్య పరీక్షలు (రీఅసెస్‌మెంటు) చేస్తారు. రోజుకు ఒక్కో ఆసుపత్రిలో 60 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు హాజరు కాకపోతే అనర్హులుగా పరిగణించి పింఛన్ తొలగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లాలో దివ్యాంగుల పింఛన్లు పొందుతున్న వారు 25,643 మంది ఉన్నారు. నంద్యాల జిల్లా ఆసుపత్రిలో రోజుకు 120 మందికి పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు కంటి వైద్యులు, చెవి-ముక్కు-గొంతు వైద్యులతో రెండు టీములు ఏర్పాటు చేశారు. మంగళ, బుధ, గురువారాల్లో రోజుకు 120 మంది ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించేందుకు నోటీసులు జారీ చేయనున్నారు.

సర్వత్రా ఆందోళన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్త పింఛన్లు ఒక్కటీ ఇవ్వక పోగా.. పింఛన్లు తొలగిస్తూ లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. వీలైనంత ఎక్కువ దివ్యాంగులకు అనర్హత చూపాలని టీడీపీ నేతలు ఇప్పటికే సంబంధిత ఆసుపత్రుల సూపరింటెండెట్లకు మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. అర్హత ఉన్నప్పటికీ అనర్హత వేటు వేసేందుకు ఇప్పటికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

కుంభాభిషేకానికి ఉరుకుంద ముస్తాబు

కౌతాళం: కుంభాభిషేకానికి ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రం ముస్తాబవుతోంది. ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. క్షేత్ర పరిధిలో భక్తులకు ఇబ్బంది లేకుండా వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నారు. ప్రధాన ఆర్చిగేట్‌కు ఇరువైపులా ఉన్న డివైడర్లను తొలగించి చదును చేస్తున్నారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న పాత కార్యాలయాన్ని పూర్తిగా పడగొట్టి చదును చేశారు. దక్షిణ ద్వారం నుంచి ప్రధాన ఆర్చిగేట్ వరకు ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నారు. కొత్తగా నిర్మించిన నాలు గు రాజగోపురాలకు రంగుల వేయడం పూర్తి చేశారు. అన్నదానం సత్రంను విశాలంగా నిర్మిస్తా మని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి నాలుగు వైపులా ఐమ్యాక్స్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తుల విరాళాలతోనే పనులను చేపడుతున్నట్లు వారు వివరించారు.



కొత్తగా నిర్మించిన రాజగోపురాలు



ఆలయ ఆవరణలో ప్లాట్‌ఫాం పనుల్లో కూలీలు

అహోబిలేశుడికి నీరాజనం

ఆళ్లగడ్డ: పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోటకందుకూరుకు చేరుకున్న అహోబిలేశుడికి భక్తులు నీరాజనం పలికారు. గ్రామస్తులు ఊరి పొలిమేర వద్దకు చేరి జ్వాలా నరసింహస్వామి, లక్ష్మీనరసింహస్వాములు ఉత్సవ పల్లకీకి ఘన స్వాగతం పలికారు. తర్వాత ఉత్సవమూర్తులను గ్రామ తెలుపులపై కొలువుంచి పూజలు నిర్వహించారు. స్వామి రాకతో గ్రామంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.



కోటకందుకూరులో పల్లకీలో దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

'అఖండ' వృషభం.. ఆకర్షణీయం



అఖండ సినిమాలోని వృషభం



అఖండ ఎద్దును తిలకించేందుకు వచ్చిన మహిళలు

అఖండ సినిమాలో కనిపించి అలరించిన వృషభం బండలాగుడు పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతపురం జిల్లా గార్లదిన్నె నుంచి వచ్చిన ఈ వృషభాన్ని తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎమ్మిగనూరు జాతర సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఎద్దుల బండలాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. సీనియర్ వృషభాల విభాగ పోటీల్లో మొదటి స్థానాన్ని ఏ. నారాయణపురానికి చెందిన ఎద్దులు సాధించాయి. వాటి యజమాని మహమ్మద్ ఫరీద్‌కు రూ.లక్ష బహుమతి ఇచ్చారు. అలాగే ద్వితీయ బహుమతి రూ. 75 వేలును ధర్మవరం సుబ్బారెడ్డి, తృతీయ బహుమతి రూ.50 వేలను ప్రొద్దుటూరుకు చెందిన మర్తల చంద్రఓబుల్‌రెడ్డి తీసుకున్నారు. అఖండ వృషభానికి నాలుగో బహుమతి వచ్చింది. – ఎమ్మిగనూరుటౌన్

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం


ఎస్పీ బాబు(ఫైల్)

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఎస్పీ బాబు (50) స్థానికంగా ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఇతను వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంపై బనగానపల్లెకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఇల్లూరు కొత్తపేట సమీపంలో కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె వైపు వస్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ మోటర్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఎస్పీ బాబు తలపై లారీ టైరు ఎక్కడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య భాను, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాయలసీమ ఇన్‌చార్జ్‌గా నర్రా పేరయ్య

కర్నూలు(అర్బన్): రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్యను రాయలసీమ ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆదివారం ఒంగోలులో జరిగిన అడ్‌హక్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నర్రా పేరయ్య తెలిపారు. వన్ స్టేట్ వన్ అసోసియేషన్ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 15వ తేదీలోగా తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి మాజీ సైనికులందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు. అలాగే నియోజకవర్గ అధ్యక్షులకు కూడా రాష్ట్ర అసోసియేషన్‌కు జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించి మార్చిలోగా ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు.

మహిళ ఆత్మహత్య


నాగలక్ష్మమ్మ(ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బాల పుల్లయ్య భార్య బోయ నాగలక్ష్మమ్మ (42) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలు వైద్యులకు చూపించినా నయంకాక పోవడంతో ఆమె జీవితంపై విరక్తి చెందింది. ఆదివారం ఉదయం పేడరంగు ద్రావణం తాగి బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామ చంద్ర గౌడ్ తెలిపారు.

రూ.40 లక్షల స్థలం విరాళం


రవిశంకర్ గురూజీకి స్థల పత్రాలు అందిస్తున్న ప్రశాంత్ కుమార్ కుటుంబ సభ్యులు

వెల్దుర్తి: ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణా కేంద్రానికి వెల్దుర్తి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ప్రశాంత్ కుమార్ రూ.40 లక్షల విలువైన స్థలం విరాళంగా అందించారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆదివారం బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కార్యాలయానికి తన కుటుంబ సభ్యులతో వెళ్లి సంస్థ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీకి అందించారు. వెల్దుర్తి పట్టణ సమీపంలో హైవే-44 పక్కన తొగర్చేడు రోడ్డులో ఉన్న 18 సెంట్ల స్థల పత్రాలు అందిస్తూ, ఆ స్థలంలో సంస్థ ద్వారా శాశ్వత శిక్షణా కేంద్రం ఏర్పాటు కోరినట్లు దాత తెలిపారు. ఇందుకు గురూజీ తనను అభినందించి, శిక్షణ కేంద్రం నిర్మాణం త్వరలో చేపడతానని హామీచ్చినట్లు తెలిపారు.

వ్యర్థం.. కళాత్మక ఖండం!

- రీసైక్లింగ్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న పసుపల గ్రామ యువకుడు
- ఖాళీ సిగరెట్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లతో ఒంటె, డీఎన్‌ఏ తదితరవి తయారీ
- రెండుసార్లు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు

బనగానపల్లె రూరల్: సాధారణంగా ఖాళీ సిగరెట్ ప్యాకెట్స్, అగ్గిపెట్టెలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు ఇలా పలు రకాల వస్తువులను వాడి వృథాగా పడేస్తుంటాం. భవిష్యత్తులో పర్యావరణానికి సవాలుగా మారే ఈ వ్యర్థాలను అలాగే వదిలేయకుండా వాటిని కళాత్మకంగా తీర్చిదిద్ది అందరితో శభాష్ అనిపించుకుంటున్నాడు ఐత ఫణీంద్ర కుమార్. రీసైక్లింగ్ ఆర్ట్స్‌లో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో సైతం చోటు సంపాదించుకొని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. బనగానపల్లె మండలం పసుపల గ్రామానికి చెందిన ఐత నాగరాజు,సుభాషిణి దంపతులకు ఇద్దరు కుమారులు, పెద్దకుమారుడు ఐత ఫణీంద్రకుమార్ డిగ్రీ (బీఎస్సీ) అభ్యసించారు. చిన్నకుమారుడు మణికంఠ డిగ్రీ చదివి ప్రస్తుతం ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నారు. కా గా ఫణీంద్రకుమార్ చిన్నప్పటి నుంచి కొత్తగా ఆలోచి ంచేవారు. చిన్న చిన్న వ్యర్థ ప్రదార్థాలను సేకరించి, విభిన్నమైన బొమ్మలు తయారు చేసే వారు.ఈ మక్కువే క్రమంగా రీ సైక్లింగ్ ఆర్ట్స్‌లో రాణించేందుకు దోహదపడింది. వాడిపడేసిన సిగరెట్‌ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లను ఆకట్టుకునేలా సరికొత్త రూపు తీసుకొచ్చాడు. పిల్లలకు ఇష్టమైన వివిధ రకాల బొమ్మలతో పాటు పొడవైన ఒంటె, డీఎన్ఏ నమూనా తయారు చేసి రికార్డు సృష్టించాడు. పలువురి నుంచి ప్రశంసలు, మెమొంటోలు అందుకున్నాడు.


వివిధ అవార్డులు, ప్రశంసా పత్రాలతో ఐత ఫణీంద్రకుమార్


టెడ్డి బొమ్మ


వ్యర్థ పదార్థాలతో ఫణీంద్రకుమార్ రూపొందించిన ఏడు అడుగుల ఒంటె నమూనా

- తొలిసారి ఫణీంద్రకుమార్ నిరుపయోగంగా ఉన్న ఖాళీ సిగరెట్ ప్యాకెట్స్ పోగు చేసి 7 అడుగుల,7 ఇంచుల ఎడారి ఒంటె(క్యామెల్) తయారు చేశాడు. 2021 డిసెంబరు నెల మొదటి వారంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వారు గుర్తించి మెడల్‌తో పాటు ప్రశంసా పత్రం ఇచ్చారు.

సహకరిస్తే విభిన్న నమూనాలు తయారు చేస్తా

నాకు పెయింటింగ్, రచనలంటే ఇష్టం. ఇందులోనూ ప్రత్యేకంగా ఉండేందుకు ప్రయత్నిస్తాను. ఈ క్రమంలోనే నేను ఖాళీ వ్యర్థాలతో వివిధ వస్తువులు తయారు చేస్తున్నాను. సహకారం లభిస్తే రీసైక్లింగ్ ఆర్ట్స్‌లో మరిన్ని కళాత్మక వస్తువులు తయారు చేస్తా. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. గుర్తించి ప్రదర్శించాలి. ఇలా చేయడం వల్లే నాకు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. – ఫణీంద్రకుమార్


ఇటీవల ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌కెక్కిన డీఎన్‌ఏ నమూనా

- 2022 జనవరి నెల మొదటి వారంలో మరో ఎడారి ఒంటె తయారు చేయగా ఆసియా రికార్డు సంస్థ మెచ్చి పతకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు.
- 2022 ఫిబ్రవరి 2వ తేది ఒంటె ఆర్ట్ నమూనా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుకెక్కింది.
- తాజాగా ఈ నెల 4వ తేది తొమ్మిదివేల సిగరెట్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, పలు వ్యర్థప్రదార్థాలను సేకరించి 210 అడుగులు 7 ఇంచులు ఉండే డీఎన్ ఎ నమూనా తయారు చేసి అబ్బురపరిచాడు.త ద్వారా రెండోసారి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు కెక్కాడు.డీఎన్ఏ తయారీకి అవసరమైన వ్యర్థ పదా ర్థాల సేకరణకు మిత్రులతో పాటు ఉపాధ్యా యుల సహాయ సహకారాలు తీసుకున్నట్లు ఫణీంద్రకుమార్ వెల్లడించారు.



కష్టం మెరిసె!

రెక్కాడితేనే గానీ డొక్కాడని కుటుంబం వారిది. గజగజ లాడే చలిలో సైతం శ్రమ పడితేనే నాలుగు మెతుకులు నోట్లోకి వెళతాయి. కర్నూలు నగరం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలో ఓ కుటుంబం ఇనుప వస్తువులతో కొడవళ్లు, గొడ్డళ్లను తయారు చేసి, విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. తెలతెలవారుతుండగానే ఇంటి యజమాని కొలిమి ఏర్పాటు చేసుకొని ఇనుప చువ్వలను వేడిస్తూ కొడవళ్లను తయారు చేస్తున్నాడు. అతని భార్య, ముగ్గురు సంతానం నిప్పుల కొలిమి నుంచే వచ్చే వేడి నుంచి చలి కాచుకుంటున్న దృశ్యం ఇదీ..

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

ప్రవృత్తిలో విజయకేతనం



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన కృష్ణ ప్రసాద్ ప్రవృత్తిగా పందెం ఎద్దుల పెంపకాన్ని చేపట్టారు. వృత్తిలోనే కాకుండా ప్రవృత్తిలో సైతం విజయం సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో 50కుపైగా బహుమతులను సొంతం చేసుకున్నారు. విజయగాథ ఆయన మాటల్లోనే.. ‘‘ నాకు చిన్న వయస్సు నుంచి ఎద్దులంటే ఇష్టముండేది. అయితే చదువులు, ఉద్యోగంతో కొన్నేళ్లు వ్యవసాయానికి స్వస్తి పలికా. కరోనా సమయంలో 2020లో ఊరికి రావడంతో వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో మొదట ఎద్దులను పెంచడం మొదలు పెట్టా. అది కాస్తా బండలాగుడు పోటీల ఎద్దుల పెంపకం వ్యాపకంగా మారింది. ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు పడ్డా. తర్వాత అన్ని విషయాలు తెలుసుకుని పందెం ఎద్దుల పెంపకాన్ని కొనసాగిస్తున్నా. దీనివల్ల నలుగురికి ఉపాధి కల్పించడంతో పాటు కొంతమేర లాభాలు కూడా వస్తున్నాయి. గత నెల పాలపండ్ల సైజు ఎద్దులను రూ.28లక్షలకు నంద్యాల జిల్లా వాళ్లకు అమ్మాను. ప్రస్తుతం మూడు జతలు ఎద్దులుండగా, ఇందులో ఒక జతను పోటీలకు సిద్ధం చేశాను.’’ అని చెప్పారు.

– కోడుమూరు రూరల్

సచివాలయ హెల్త్ సెక్రటరీలకు ద్వంద శాఖల నియంత్రణ వద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న లీలావతి

కర్నూలు(హాస్పిటల్): సచివాలయ హెల్త్ సెక్రటరీలకు ద్వంద శాఖల నియంత్రణను రద్దు చేయాలని ఏపీ గ్రామ/వార్డు సచివాలయాల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. లీలావతి డిమాండ్ చేశారు. ఆదివారం అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం కర్నూలులోని ఎస్టీయు భవన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లీలావతి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఆరోగ్యశాఖకు ఆన్‌లైన్ ఉద్యోగులుగా ఉన్నప్పటికీ, పంచాయతీ రాజ్ శాఖ సంబంధించిన పనులు కూడా వారితో చేయించడం వల్ల పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఏఎన్ఎంలుగా పీహెచ్‌సీ సెంటర్లలో వ్యాక్సినేషన్, మాతాశిశు సంరక్షణ వంటి పనులు చేయాల్సిన తాము పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జియో యాప్స్ హౌస్ హోల్డ్ సర్వే అనేక యాప్‌లలో డేటా ఎంట్రీ ప్రతి నెలా ఒకటవ, రెండవ తేదీల్లో పెన్షన్ పంపిణీ ఇలాంటి ఇతర పనులు కూడా అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర ఉప ప్రధాన కార్యదర్శి టి. రామాంజనేయులు, నాయకులు అరుణ, శోభారాణి, సుమలత, నాగవేణి, సుగణమ్మ, ఉమాదేవి, జగదీశ్వరి పాల్గొన్నారు.

శివదీక్ష స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి



బనగానపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదివారం శివదీక్ష స్వీకరించారు. ముందుగా కాటసాని తన సతీమణి ఉమామహేశ్వరమ్మతో కలిసి మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత సంప్రదాయబద్ధంగా శివదీక్ష స్వీకరించారు. ఆయనతో పాటు పలువురు భక్తులు ఈ దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకులు పాల్గొన్నారు.

సామాజిక హితమే సాహిత్య లక్ష్యం కావాలి

- క్లస్టర్ వర్సిటీ వీసీ సాయిగోపాల్

కర్నూలు కల్చరల్: సామాజిక హితమే లక్ష్యంగా సాహిత్యం రావాలని క్లస్టర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో డాక్టర్ మీరా సుబ్రహ్మణ్యం రచించిన చీకటిలో వేకువలో, ది కేజ్ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. జీవన సారాన్నంతా మీరా తన రచనల్లో చూపించారన్నారు. నరసం అధ్యక్షురాలు కావ్యం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు సంబంధించిన కథలను డాక్టర్ మీరాబాయి హృద్యంగా రాశారన్నారు. డాక్టర్ ఫరీదా, టీఎస్ఏ కృష్ణమూర్తి, డాక్టర్ చంద్రమౌళిని, డాక్టర్ హరికిషన్ పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ దండేబోయిన పార్వతి దేవి సదస్సును సమన్వయం చేశారు. అనంతరం రచయిత్రి మీరా బాయి, తంగిరాల సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, కవులు, రచయితలు జంధ్యాల రఘుబాబు, గొరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి, కెంగార మోహన్, లక్ష్మయ్య, శ్రీధర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


రచయిత్రి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీశైలంలో నృత్యనీరాజనం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన వాగ్దేవి సంగీత కళాశాల కళాకారులు నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, అయిగిరినందిని, శివాష్టకం, శివ తాండవం, లింగాష్టకం, నటరాజ, ఓం నమఃశివాయ తదితర గీతాలకు అపర్ణ, వంశీ, వెన్నెల, సాత్విక, ధన్విక, సహస్ర, అపూర్వ, శ్రీవిష్ణు, సుమ, మహి, శైలజ, సుజాత, మోక్షిత, లిఖిత, నక్షత్ర, చందన, అమూల్య, భవాని తదితరులు నృత్య ప్రదర్శన చేశారు. అలాగే రెండో కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన ఎం.లక్ష్మీ నీరజా బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన చేసింది.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ ఈ నెల 20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనుంది. ఈ నెల 31 వరకు పశు ఆరోగ్య శిబిరాల కొనసాగనున్నాయి. ఇందుకోసం ప్రతి మండలంలో రెండు టీమ్‌లు ఏర్పాటు అయ్యాయి. జిల్లాలో 11.25 లక్షల గొర్రెలు, మేకలకు, 2.74 లక్షల పెద్ద పశువులకు, 33,500 దూడలకు నట్టల నివారణ మందులను తాపుతారు. పశు ఆరోగ్య శిబిరాల్లో పశు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయడం, వ్యాధి నిరోధక టీకాలు వేయడం, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తారని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ జి.శ్రీనివాస్ తెలిపారు.

వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్


తెలకపల్లి నరసింహయ్యకు నివాళులర్పిస్తున్న ఎంఏ గఫూర్, తెలకపల్లి రవి తదితరులు

కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన ప్రాంతాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తేలా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభ, తెలకపల్లి నరసింహయ్య ఆరో వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం లలిత కళాక్షేత్రంలో సదస్సును నిర్వహించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలపై వక్తలు మాట్లాడారు. ఎంఏ గఫూర్ ప్రసంగిస్తూ.. అమరావతికి వేల కోట్లు ఖర్చు చేసే రాష్ట్ర ప్రభుత్వం మిగతా ప్రాంతాలను ఎలా అభివృద్ధిలోకి తెస్తుందో చెప్పాలన్నారు. పోలవరం వెంటనే పూర్తి చేయడంతోపాటు విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలన్నారు. తెలకపల్లి నరసింహ కుమారుడు తెలకపల్లి రవి మాట్లాడుతూ.. ఏపీ అభివృద్ధి పవన్, లోకేష్ అభివృద్ధిగా మారుతోందన్నారు. కర్నూలులో హైకోర్టును ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడి విజన్ 2020లా విజన్ 2047 కూడా విఫలమవుతుందన్నారు. సదస్సులో అనంతపురం జిల్లా కార్యదర్శి నల్లప్ప, తెలకపల్లి హరి మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాయకులు పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, కేవీ నారాయణ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ట్రెజరీ ఎన్నికలు

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసులు, వేణుగోపాల్ ఎన్నిక


ఎన్నిక పత్రాలు ప్రదర్శిస్తున్న కొత్త కార్యవర్గ సభ్యులు

కర్నూలు (అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ఖజానా లెక్కల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా ఖజానా కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షుడు కుప్పుస్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నిక ప్రక్రియను రాష్ట్ర ఉపాధ్యక్షులు పలనాటి సునీల్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీఓగా పనిచేస్తున్న జె.శ్రీనివాసులు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా సీనియర్ అకౌంటెంట్ ఎ.వేణుగోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ స్‌టీఓ ఇ.సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా తిమ్మయ్య, భార్గవి, షేక్ దిల్షాద్, కోశాధికారిగా ఎం .మహమ్మద్ తారిక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధుశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా ప్రకాష్, దామోదరమ్మ, నాగార్జున ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ట్రెజరీ ఉద్యోగులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పెయింటర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బెలగుప్ప మండలం గంగవరానికి చెందిన పెయింటర్ ముమ్ముళ్ల కృష్ణ (37) అనంతపురం పట్టణానికి చెందిన గోవిందుతో కలిసి బైక్‌పై ఆదోనికి బయలుదేరారు. మార్గమధ్యలో తుగ్గలి వద్ద రోడ్డు పక్కనున్న ఆగి ఉన్న లారీ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకనున్న గోవిందుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండకు తరలించారు. మృతుడికి భార్య తిమ్మక్క, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

మగ సంతానం లేదని..

- బాలుడిని అపహరించిన వ్యక్తి
- సీసీ ఫుటేజీ చిత్రాలు వైరల్ చేసిన పోలీసులు
- అనుమానితుడిని గుర్తించిన ప్రజలు
- చివరకు తల్లిదండ్రుల చెంతకు బాలుడు


తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించిన పోలీసులు

ఎమ్మిగనూరురూరల్: బాలుడి అదృశ్యం కేసును ఎమ్మిగనూరు పట్టణ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. సాంకేతిక, సామాజిక మాధ్యమాల సహాయంతో పోలీసులు బాలుడిని క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చి శభాష్ అనిపించుకున్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన బోయ రామాంజి, బోయ నాగవేణి దంపతులకు ఐదేళ్ల వయస్సు ఉన్న కుమారుడు రామ్‌చరణ్ ఉన్నాడు. ఈనెల 17వ తేదీ సాయంత్రం తల్లిదండ్రులు కుమారుడిని ఇంటి దగ్గరే వదలి జాతరలోకి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి ముందు ఆడుకుంటున్న కుమారుడు కనిపించకపోవడంతో ఆందోళన చెంది రాత్రంతా అంతటా గాలించారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం మధ్యాహ్నం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పట్టణ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ డాక్టర్ నాయక్ కేసు నమోదు చేసి ఐదు బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి నివాసం ఉండే సమీపంలో మెడికల్ షాప్ సీసీ ఫుటేజిని పరిశీలించగా ఒక వ్యక్తి సెల్ చూపించి బాలుడిని తీసుకెళ్లిన దృశ్యాలు లభించాయి. ఈ సీసీ ఫుటేజ్ దృశ్యాలను సోషల్ మీడియా, జిల్లా పోలీస్ గ్రూప్స్, మీడియా గ్రూప్‌ల్లో వైరల్ చేశారు. పోలీసులు ఊహించినట్లే కొందరు వ్యక్తులు అనుమానితుడిని గుర్తు పట్టడం, ఆ వ్యక్తి చిన్నారిని తీసుకుని ఎమ్మిగనూరు చేరుకోవడం, చివరకు బాలుడు తల్లిదండ్రుల చెంతకు చేరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దేవనకొండ మండలం పుల్లాపురం గ్రామానికి చెందిన మాదిగ మునిస్వామి అనే వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మగ పిల్లలు లేకపోవటంతో ఎమ్మిగనూరులో బాలుడిని అపహరించినట్లు నిందితుడి చెబుతున్నాడు. సీసీ ఫుటేజ్ దృశ్యాలు గ్రూప్స్‌లో వైరల్ కావడంతో దేవనకొండకు చెందిన కొందరు వ్యక్తులు మునిస్వామిగా గుర్తించారు. పోలీసులు గాలిస్తున్నారని, పిల్లాడిని అప్పగించాలని, లేకపోతే ఇబ్బందులు పడతావని హెచ్చరించడంతో ఆదివారం ఉదయం ఎమ్మిగనూరుకు చేరుకున్నాడు. బాలుడితో ఆసుపత్రి వద్ద అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కొత్త వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. కేసును 24 గంటల్లో ఛేధించిన పట్టణ సీఐ,ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ ఉపేంద్రబాబు అభినందించారు.

దోపిడీ దొంగల హల్‌చల్

- దంపతులపై కత్తులతో దాడి

పాణ్యం: కర్నూలు – నంద్యాల రహదారిలో శాంతి రామ్ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి దారి దోపిడీ దొంగలు తెగబడ్డారు. భార్యాభర్తలపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన దామరేకుల పెద్దన్న, జయమ్మ దంపతుల కుమార్తె గర్భిణి కావడంతో వైద్య చికిత్స కోసం ఆదివారం శాంతిరామ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే డాక్టర్ల సూచన మేరకు రాత్రి అక్కడే ఉంచారు. జయమ్మ బహిర్భూనికి కోసం భార్యాభర్తలు ఆసుపత్రి సమీపంలోని ఓ పొలం వద్ద ఆగి ఉండగా అక్కడే ఉన్న దొంగలు ముందుగా పెద్దన్నపై కత్తితో తల, కాళ్లపై దాడి చేశారు. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే పడిపోయాడు. అనంతరం కేకలు వేస్తున్న జయమ్మను చావబాదారు. ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కుని పరారయ్యారు. అతి కష్టం మీద ఆమె భర్తను తీసుకుని ఆసుపత్రికి చేరుకుంది. రక్త గాయాలతో ఉన్న వారిని ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి లోపలికి తీసుకెళ్లారు. ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దొంగల కోసం గాలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.